క్లుప్తంగా

పాలకొండ క్షేత్రానికి ఎకో టూరిజం గుర్తింపు ఇవ్వాలి

కడప సెవెన్‌రోడ్స్ : కడప నగర సమీపంలోని ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన శ్రీ పాలకొండ్రాయ స్వామి ఆలయానికి ఆంధ్రప్రదేశ్ అటవీశాఖలోని వన విహారి పథకం ద్వారా శాశ్వత ఎకో టూరిజం గుర్తింపు ఇవ్వాలని ఆలయ ఈఓ శ్రీనివాసులు కోరారు. ఆలయ చైర్మన్ రెడ్డెయ్య యాదవ్ ఆదేశాల మేరకు ముఖ్య అటవీ సంరక్షణ అధికారి, జిల్లా అటవీ శాఖ అధికారులకు ఆయన వినతిపత్రాన్ని సమర్పించారు. 1882 మద్రాసు అటవీచట్టం మేరకు తమ ఆలయానికి స్థలం, రికార్డులను అప్పగించాలని కోరారు. ఎకో టూరిజం గుర్తింపు వస్తే భక్తులకు మెరుగైన వసతులు కల్పించే అవకాశం ఉంటుందని తెలిపారు.

నీటి సరఫరా అధ్వాన్నం

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థ పరిధిలో తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ అధ్వాన్నంగా మారిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మున్సిపల్ విభాగం సంయుక్త కార్యదర్శి శ్రీరంజన్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేల సేవలో తరించడానికే కమిషనర్‌కు సమయం సరిపోతోందని, ప్రజలకు సేవలందించే సమయం ఆయనకు లేదన్నారు. కార్మికుల సమ్మె వల్ల చెత్తచెదారం పేరుకుపోయిందని, చాలా ప్రాంతాలకు నీటి సరఫరా జరగడం లేదన్నారు. అధికారులెవ్వరూ వార్డుల్లో పర్యటించి సమస్యలు తెలుసుకోవడం లేదన్నారు. వీధి దీపాలు వెలగకపోవడంతో రాత్రిళ్లు నగరం అంధకారంగా మారుతోందన్నారు. ఫలితంగా దొంగతనాలు జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. వర్షాకాలం నేపథ్యంలో కాలువల్లో పూడికతీత పనులు చేపట్టలేదని, పూడిక తీసిన చోట ఎత్తకుండా అలాగే ఉంచారన్నారు. కార్పొరేషన్ యంత్రాంగం దోమల నివారణ చర్యలు చేపట్టలేదన్నారు.

పార్టీ ఉంచిన నమ్మకాన్ని నిలబెడతా

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెడతానని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకట సుబ్బారెడ్డి అన్నారు. ఇటీవల రాష్ట్ర కార్యదర్శిగా ఆయన్ను నియమించడంతో మంగళవారం పార్టీ జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్‌రెడ్డిని వారి స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి, గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా రెడ్యం మాట్లాడుతూ తనకు పదవి రావడానికి కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కేసీ కెనాల్ మాజీ వైస్ చైర్మెన రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి, బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి ఏ. శివయ్య యాదవ్, జిల్లా కార్యదర్శి బి. సుబ్బరాయుడు, ఎం. భాస్కర్‌రెడ్డి, ఎస్. విజయ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్ పర్మిషన్ ఇప్పించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: వైఎస్సార్ ఫైన్ ఆర్ట్స్ అండ్ ఆర్కిటెక్ యూనివర్సిటీ విద్యార్థులకు కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్ పర్మిషన్ ఇప్పించాలని మంగళవారం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణకు ఏఐఎస్‌ఎఫ్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలరాజు మాట్లాడుతూ 2020 సంవత్సరంలో వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం డాక్టర్ వైఎస్సార్ ఫైన్ ఆర్ట్స్ అండ్ ఆర్కిటెక్ యూనివర్సిటీని 13 స్పెషలైజ్డ్ డిపార్ట్‌మెంట్‌లతో ఏర్పాటు చేసిందన్నారు. అయితే కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్ నుండి పర్మిషన్ రాకపోవడంతో విద్యార్థులు తమ డిగ్రీ ఎందుకూ పనికిరాదని పోరాటానికి సన్నద్ధమయ్యారన్నారు. వెంటనే కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్ నుండి పర్మిషన్ ఇప్పించేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమం లో విద్యార్థులు వంశీ, సతీష్, శివతేజ, గౌతమ్, శివ గణేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

పర్యటన విజయవంతం చేయాలి



విలేకరులతో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పీవీఎన్ మాధవ్ ఈనెల 27వ తేదీ నుంచి రాయలసీమ ప్రాంతంలో పర్యటించనున్న నేపథ్యంలో ఆయన పర్యటన విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు జంగిటి వెంకట సుబ్బారెడ్డిలు పిలుపునిచ్చారు. మంగళవారం కడప నగరంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 27వ తేదీన కడప నగర పరిధిలోని దేవుని కడపకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు. అనంతరం అదేరోజు కడపలో పార్టీ శ్రేణులతో మమేకమవుతారన్నారు. అలాగే 28న నంద్యాల, 29న కర్నూలు, 30న అనంతపురం, 31న సత్యసాయి జిల్లాలో ఆయన పర్యటన కొనసాగుతుందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ వంగల శశిభూషణ్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయాకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడుతోపాటు జిల్లా బీజేపీ నేతలు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన



అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

కడప కార్పొరేషన్: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చేస్తున్న సమ్మె పదో రోజుకు చేరుకుంది. మంగళవారం సమ్మెలో భాగంగా వారు అర్ధనగ్న ప్రదర్శన చేసి, కార్పొరేషన్ కార్యాలయం నుంచి డాన్‌బోస్కో ఐటీఐ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి పీవీ సుబ్బయ్య మాట్లాడుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు గతంలో ఇచ్చిన జీవోను సవరించి 124 జీవోను ఇచ్చారని, ఇది చాలా దుర్మార్గమైన జీవో అన్నారు. జీవో నెంబర్ 36 ను అమలు చేయమని తాము అడుగుతుంటే ప్రభుత్వం కార్మిక నాయకులను చర్చలకు పిలవకుండా 124 జీవో విడుదల చేయడం దారుణమన్నారు. ఇంజినీరింగ్ కార్మికులకు రూ.21వేలు, 24500 వేతనాలు ఇవ్వాలని, నాన్ పీహెచ్ అని తొలగించి కేడర్ స్ట్రెంగ్త్ ఏర్పాటు చేయాలని తాము కోరుతుంటే ప్రభుత్వం మరో విధంగా చేస్తోందన్నారు. కార్మికుల రిటైర్‌మెంట్ వయసును 62 ఏళ్లకు పెంచి, రిటైర్‌మెంట్ బెనిఫిట్లు ఇవ్వాలన్నారు. అంతవరకూ సమ్మె జరుగుతూనే ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం విజయభాస్కర్, కోశాధికారి ఎస్ గోపి, ఉపాధ్యక్షుడు కె. తిరుపాల్, సహాయ కార్యదర్శులు ఏం ఆనంద రావు, టీ. బ్రహ్మానందరెడ్డి, మున్సిపల్ నగర అధ్యక్ష, కార్యదర్శులు వైఎం కేశవులు, రవి, డ్రైవర్స్ యూనియన్ నాయకులు ఎస్ కిరణ్, నగర సహాయ కార్యదర్శి ప్రకాష్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీరామ్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన

కడప అర్బన్ : కడప డీఎస్పీ ఎ.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని ట్రాఫిక్ పోలీసు స్టేషన్ ఆవరణలో ఆటో డ్రైవర్లకు రహదారి భద్రత నిబంధనల పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. ఆటో డ్రైవర్ లు డ్రైవింగ్ లైసెన్సులు , ఆటోలు నడిపేటప్పుడు ఆటోల రికార్డ్ లు తప్పక కలిగి ఉండాలని తెలిపారు. పరిమితికి మించి ప్రయాణికులను ఆటోలో ఎక్కించుకోకూడదన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారికి మోటారు వాహనాల చట్టం ప్రకారం జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో ట్రాఫిక్ సి.ఐ జావీద్, ట్రాఫిక్ ఎస్.ఐ జయరాముడు, వన్ టౌన్ ఎస్ ఐ ప్రతాప్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పది రోజుల్లో సమాధానం ఇవ్వాలి
– డీఈఓ షంషుద్దీన్

కడప ఎడ్యుకేషన్: కడప ఎంఈఓ గంగిరెడ్డి, పొద్దుటూరు ఎంఈఓ సావిత్రితోపాటు ఆలంఖాన్‌పల్లి ఎంపీపీ స్కూల్ ఎస్‌జీటీ శివారెడ్డిలకు నోటీసులు అందించామని, వారు పది రోజులలోపు సమాధానం ఇవ్వాలని కడప డీఈఓ షంషుద్దీన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కడప, పొద్దుటూరు ఎంఈఓలకు గతంలో ఇచ్చిన నోటీసులకు సరైన సమాధానం ఇవ్వకపోవడంతో వారిపై పాఠశాల విద్య ఆర్‌జేడీకి నివేదికలు పంపినట్లు తెలిపారు. అలాగే ఆలంఖాన్‌పల్లి ఎంపీపీ పాఠశాలలో పని చేసే శివారెడ్డికి కూడా నోటీసులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. వీరంతా ఆర్టికల్ ఆఫ్ చార్జెస్‌కు పది రోజుల్లో సమాధానం ఇవ్వాలని డీఈఓ పేర్కొన్నారు.

డ్రాయింగ్ పోటీకి చీఫ్ జడ్జ్‌గా చిత్రకళా ఉపాధ్యాయుడు

కడప ఎడ్యుకేషన్: హ్యూమానిటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జూలై 27 విశాఖపట్నంలోని గీతం విశ్వవిద్యాలయంలో నిర్వహించబోయే ఇంటర్ సీసీఐ డ్రాయింగ్ పోటీలకు పలు అవార్డులు అందుకున్న బీరీ గంప మల్లయ్య చీఫ్ జడ్జ్‌గా ఎంపికయ్యారు. గంప మల్లయ్య కడపలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ (హెచ్‌పిసి) లో ఆర్ట్ టీచర్‌గా పని చేస్తున్నారు. గంప మల్లయ్యను పాఠశాల యాజమాన్యం అభినందించింది.

నిరుపేద పిల్లలకు ఆధార్ రిజిస్ట్రేషన్



ఆధార్ నమోదును పరిశీలిస్తున్న న్యాయమూర్తి బాబా ఫక్రుద్దీన్, ఇతర అధికారులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవా సదన్‌లో మంగళవారం నిరుపేద పిల్లల కోసం ఆధార్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్‌జడ్జి బాబా ఫక్రుద్దీన్ మాట్లాడుతూ నిరుపేద పిల్లల ఆధార్ కోసం సర్వే నిర్వహించి జిల్లావ్యాప్తంగా 1229 మందిని గుర్తించడం జరిగిందన్నారు. జిల్లా అధికారుల సహాయంతో న్యాయ సేవా సదన్‌లో ఆధార్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో డిస్టిక్ రెవెన్యూ ఆఫీసర్ విశ్వేశ్వరనాయుడు, రాయచోటి రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాస్, డిస్టిక్ ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్టుమెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీలక్ష్మి, అడిషనల్ మున్సిపల్ కమిషనర్ రాకేష్ చంద్ర, కడప డిస్ట్రిక్ ప్రొఫెషన్ ఆఫీసర్ రవికుమార్, రిమ్స్ రీజినల్ మెడికల్ ఆఫీసర్, వివిధ ప్రభుత్వ శాఖ అధికారులు పాల్గొన్నారు.

డ్రైవర్లు ఆర్టీసీని ప్రమాద రహిత సంస్థగా మార్చాలి



మాట్లాడుతున్న కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ బస్సులను నడుపుతున్న డ్రైవర్లు సంస్థను ప్రమాద రహిత సంస్థగా మార్చి ప్రయాణీకుల మన్ననలు పొందాలని కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, ట్రాఫిక్ సీఐ జావీద్‌లు పిలుపునిచ్చారు. మంగళవారం కడప నగరంలోని ఆర్టీసీ ఆర్‌ఎం కార్యాలయ సమావేశ భవనంలో తరచూ ప్రమాదాలు చేసే డ్రైవర్‌లకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న డీఎస్పీ, సీఐలు మాట్లాడుతూ ఆర్టీసీ ప్రయాణమంటే ప్రజలు సురక్షిత ప్రయాణమని భావిస్తుంటారని, అలాంటి పేరు డ్రైవర్లు నిలబెట్టాలన్నారు. ముఖ్యంగా సెల్‌ఫోన్ డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్, మద్యం సేవించి విధులకు హాజరు కావడం, ప్రమాదకర స్థితిలో ఓవర్ టేక్ చేయడం మానుకోవాలన్నారు. అలాగే ప్రయాణీకులపట్ల కూడా మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. డ్రైవర్ల పనితీరుతోనే సంస్థకు మంచి పేరు వస్తుందని తెలుసుకోవాలన్నారు. ముఖ్యంగా ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న తరుణంలో అన్ని అంశాలను పరిగణలోకి తీసుకుని బస్సులను నడపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు డిపో మేనేజర్ ప్రవీణ్, బద్వేలు డిపో ఎస్‌డీఐ బీఎస్ రెడ్డి, జిల్లా సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ సుధా కృష్ణారెడ్డితోపాటు 20 మంది డ్రైవర్లు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో భవిష్యత్తు అంధకారం



విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి మాదక ద్రవ్యాల పోస్టర్స్‌ను విడుదల చేస్తున్న అధికారులు

కడప ఎడ్యుకేషన్: మత్తు పదార్థాలకు అలవాటు పడితే భవిష్యత్తు అంధకారం అవుతుందని ఈగల్ టీం అధికారులు పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా 'ఈగల్' టీం ఆధ్వర్యంలో కడప నగరంలోని ఉర్దూ మునిసిపల్ హైస్కూల్‌లో మంగళవారం యాంటి డ్రగ్స్ అవేర్ నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈగల్ అధికారులు మాట్లాడుతూ సమాజంలో కొంతమంది యువత మత్తుకు అలవాటు పడి బంగారు భవిష్యత్తు నాశనం చేసుకుంటున్నారన్నారు. పలువురు మత్తు పదార్థాలకు అలవాటు పడి, డబ్బుల కోసం నేరాలు హత్యలకు సైతం పాల్పడుతూ, మంచి భవిష్యత్తును కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మీ ప్రాంతాలలో ఎవరైనా మత్తు పదార్థాలకు అలవాటు పడ్డట్లు గుర్తించినా, గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారం తెలిస్తే ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972 ద్వారా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ హెడ్ మాస్టర్ రహిమా బాను, ఈగల్ క్లబ్ అసిస్టెంట్ కో ఆర్డినేటర్ సాదిక్ అలీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, 'ఈగల్' సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీ నేతలకు పరామర్శ



రత్న కుమారిని పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి



ఇస్మాయిల్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్: ప్రమాదవశాత్తు కాలు విరిగి ఆపరేషన్ అనంతరం తన ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి రత్న కుమారిని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి పరామర్శించారు. మంగళవారం రాజారెడ్డి వీధిలోని ఆమె స్వగృహానికి వెళ్లి కాలు విరగడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైఎస్సార్‌సీపీ సంయుక్త కార్యదర్శి బూసిపాటి కిశోర్, మాజీ కార్పొరేటర్ పత్తిరాజేశ్వరి, కో ఆప్షన్ సభ్యురాలు బి. మరియలు, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

ఇస్మాయిల్ లేని లోటు తీర్చలేనిది

వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకుడు ఇస్మాయిల్ లేని లోటు తీర్చలేనిదని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. ఇటీవల ఇస్మాయిల్ మృతి చెందిన నేపథ్యంలో మంగళవారం ఆయన వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇస్మాయిల్ మృతికి సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబానికి సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ టీటీడీ బోర్డు సభ్యులు మాసీమ బాబు, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ సంయుక్త కార్యదర్శి పాకా సురేష్, మున్నా, శ్రీరంజన్‌రెడ్డి, అజ్మతుల్లా పాల్గొన్నారు.

బాలల పరిరక్షణకు కృషి



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి

కడప సెవెన్‌రోడ్స్ : బాలల రక్షణ, హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమవంతుగా కృషి చేయాలని ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్‌లో ×బాలల రక్షణలో భాగస్వాముల పాత్ర అనే అంశంపై జమ్మలమడుగు, పులివెందుల రెవెన్యూ డివిజన్లలో ఉన్న తహసీల్దార్లు, ఎంపీడీఓలు, బాల సంక్షేమ పోలీసు అధికారులు, మండల విద్యాధికారులకు ఒక్కరోజు అవగాహన వర్క్‌షాప్ నిర్వహించారు. శ్రీలక్ష్మి మాట్లాడుతూ బాలల రక్షణలో ప్రతి విభాగం సమన్వయం అవసరమన్నారు. పిల్లలకు సంబంధించిన కేసుల్లో వీరందరి పాత్ర ఎంతో కీలకమని, జేజే చట్టం – 2015, పీఓసీఎస్‌ఓ చట్టం – 2012, బాలల వివాహ నిషేధ చట్టం వంటి చట్టాల అమలులో ఈ అధికారుల బాధ్యతలు స్పష్టంగా ఉండాలన్నారు. చివరగా వర్క్‌షాప్‌లో పాల్గొన్న అధికారులకు పీడీ శ్రీలక్ష్మి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా శిశు సంరక్షణ అధికారులు, సమాజ సంక్షేమ శాఖ ప్రతినిధులు, బాలల హక్కుల పరిరక్షణలో పని చేసే స్వచ్ఛంద సంస్థలు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలు ఇవ్వాలి

కడప ఎడ్యుకేషన్: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఆర్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డిమాండ్ చేశారు. మంగళవారం నాయకులతో కలిసి కడపలో విలేకరుతో మాట్లాడారు. ఉన్నత విద్యకు శాపంగా మారిన జిఓ 77 ను వెంటనే రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సాయి, నవీన్, జిల్లా ఉపాధ్యక్షులు నాగమలయ్య, వెంకట సుబ్బయ్య, నాయకులు రవి తదితరులు పాల్గొన్నారు.

పర్యవేక్షణ కోసం అధికారులను నియమించండి

కడప ఎడ్యుకేషన్: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉర్దూ పాఠశాలల పర్యవేక్షణ, అభివృద్ధి కోసం అధికారులను నియమించాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్(రూట) రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ డిమాండ్ చేశారు. మంగళవారం సాయంత్రం కడపలో ముఖ్య నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ

గత కొన్ని సంవత్సరాలుగా రాష్ట్రంలోని దాదాపు అన్ని జిల్లాలలో ఉర్దూ అధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. దీంతో ఉర్దూ పాఠశాలల పర్యవేక్షణకు, ఉర్దూ ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమాలకు, ఉర్దూ పాఠ్యపుస్తకాల సరఫరాకు, ఉర్దూ పాఠశాలల అభివృద్ధికి ఆటంకం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మస్తాన్ వలి, సిరాజ్, అఫ్జల్ బాషా తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్, శక్తి టీమ్‌ల నిఘాలో విద్యాసంస్థలు



శ్రీహరి డిగ్రీ కళాశాలల వద్ద శక్తిటీం సభ్యులు

కడప ఎడ్యుకేషన్: నగరంలోని కళాశాలలు, పాఠశాలల సమీపంలో ఆకతాయిల ఆటకట్టించేందుకు డ్రోన్ కెమెరాలతో నిఘా పెడుతున్నామని మహిళా పోలీస్ స్టేషన్ సి.ఐ ఎల్లమరాజు, ఎ.హెచ్.టి.యు ఎస్.ఐ శాంతమ్మ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం శక్తి టీముల ఆధ్వర్యంలో నగరంలోని పలు కళాశాలలు, పాఠశాలల వద్ద బాలికలు, మహిళలకు భద్రతపై భరోసా కల్పిస్తూ అత్యాధునిక డ్రోన్ కెమెరాలను వినియోగిస్తూ ఈవ్ టీజింగ్‌కు పాల్పడే వారిపై దృష్టి సారించారు. మహిళలను వేధించే ఆకతాయిలను డ్రోన్ కెమెరాల ద్వారా గుర్తించి అదుపులోకి తీసుకునేందుకు వీలుగా చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో 'శక్తి' టీమ్ సిబ్బంది పాల్గొన్నారు.



దుర్గమ్మ సన్నిధిలో పూజలు

కడప సెవెన్‌రోడ్స్ : కడప నగరం శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం భక్తులు దోష నివారణ కోసం రాహుకాల పూజలను నిర్వహించారు. తొలుత అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహికంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు పూజా విధానాన్ని తెలుపుతూ కార్యక్రమాన్ని నిర్వహింపజేశారు. భక్తులు అమ్మవారికి నిమ్మకాయ దీపాలను వెలిగించి మొక్కుకున్నారు. నిర్వాహకులు సుధా మల్లికార్జునరావు, దుర్గాప్రసాద్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

25 నుంచి ఆలయంలో శ్రావణమాస విశేష పూజలు

ఈ నెల 25వ తేదీ నుంచి పవిత్ర శ్రావణ మాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో మాసంలో ప్రతి రోజు విశేష పూజలు జరుగుతాయని ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జునరావు తెలిపారు. భక్తులు విజయదుర్గమ్మను దర్శించుకొని అమ్మవారి అనుగ్రహాన్ని పొందాలన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులకు హోమియో మందులను వేస్తున్న ప్రిన్సిపాల్ జ్ఞానేశ్వరి

కడప ఎడ్యుకేషన్/ కడప రూరల్: సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని హోమియోపతి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ షాకీర్ హుస్సేన్ పేర్కొన్నారు. మంగళవారం కడపలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు హోమియో అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన విద్యార్థినీ విద్యార్థులకు హోమియో వైద్యంపై అవగాహన కల్పించారు. హోమియో మందులు రోగ నివారణకు బాగా పనిచేస్తాయన్నారు. అనంతరం విద్యార్థులకు హోమియో మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ జ్ఞానేశ్వరి, ఎన్ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ చెప్పలి రాజారావు, సీనియర్ అధ్యాపకులు అబీబుల్లా, శ్రీరాములు రెడ్డి, సుధాకర్ రెడ్డి, యోగేశ్వర్ రెడ్డి, ఒకేషనల్ లెక్చరర్ సుధాకర్‌రాజ పాల్గొన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

కడప కార్పొరేషన్: కడప నగరంలోని 49వ డివిజన్ పూలోన్‌పల్లెలో 15 ఆర్థిక సంఘం నిధులు రూ.30లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులకు కమలాపురం ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణ చైతన్యరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కడప నగరపాలక సంస్థ కమిషనర్ మనోజ్‌రెడ్డి, అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్ర, 49వ డివిజన్ కార్పొరేటర్ ఉమాదేవి, డివిజన్ ఇన్‌చార్జి మోహన్‌రెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శక్తి యాప్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

కడప ఎడ్యుకేషన్: మహిళలు, బాలికలు శక్తి యాప్ సేవలు సద్వినియోగం చేసుకుని పోలీసు భద్రత పొందాలని శక్తి టీమ్ మహిళా ఎస్.ఐ శాంతమ్మ పేర్కొన్నారు. ఈ యాప్ ఆపద సమయంలో ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. మంగళవారం కడపలోని శ్రీహరి డిగ్రీ కళాశాల విద్యార్థులకు శక్తి యాప్ ఆవశ్యకత, ప్రాధాన్యత గురించి కడప తాలుకా ఎస్ఐ తులసీ నాగప్రసాద్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోషక యాజమాన్యంతోనే నేల ఆరోగ్యం



మాట్లాడుతున్న కృషి విజ్ఞాన కేంద్ర సమన్వయకర్త డాక్టర్ వీరయ్య

కడప అగ్రికల్చర్: సమగ్ర పోషక యాజమాన్యంతోనే నేల ఆరోగ్యంగా ఉంటుందని ఊటుకూరు వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రంలో సమగ్ర పోషక యాజమాన్యంపై ధృవీకరణ విద్యలో భాగంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. శిక్షణలో భాగంగా డా.జి.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ సమగ్ర పోషక యాజమాన్యం అనేది పంటల ఉత్పాదకతను నిలుపుకుంటూ నేల ఆరోగ్యాన్ని పరిరక్షించే సమగ్ర విధానం అన్నారు. ఇందులో సేంద్రియ ఎరువులు, బయోఫర్టిలైజర్లు, అజోటోబాక్టర్, ఫాస్ఫేట్ సాల్యూబిలైజింగ్, రసాయన ఎరువుల సమన్వయ పూర్వక వినియోగం జరుగుతుందన్నారు. ఈ విధానం వలన పోషకాల సమతుల్యత కొనసాగుతుందన్నారు. ఉదయగిరి వ్యవసాయ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణ రెడ్డి , కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయ కర్త డా. ఎ. వీరయ్య మాట్లాడుతూ నేల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, ఖర్చులను తగ్గించడం ప్రధాన లక్ష్యంగా రైతులకు సేవ చేయాలని సూచించారు. కార్యక్రమంలో సస్య రక్షణ శాస్త్రవేత్త డా. వి. శిల్పకళ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఆర్ఐఓకు వినతి

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో కార్పొరేట్ ప్రవేట్ జూనియర్ కళాశాలలను కట్టడి చేసి ప్రభుత్వ జూనియర్ కళాశాలలను కాపాడాలని పిడిఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న కోరారు. ఈ విషయమై మంగళవారం నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆర్ఐఓ వెంకటేశ్వర్లును కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ , జిల్లాలో కడప నగరం, మైదుకూరు, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, బద్వేల్, పోరుమామిళ్ల, పులివెందుల ప్రాంతాల్లోని కార్పొరేట్ ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాలు ఎంసెట్, ఐఐటి, జేఈఈ, మెయిన్స్, నీట్ పేర్లతో విద్యార్థులు వారి తల్లిదండ్రుల దగ్గర నుండి వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారన్నారు. విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పిడియస్‌యు నగర నాయకులు వసుంధర, కార్తీక్ పాల్గొన్నారు.